## పటిష్ట పోలీసు బందోబస్తు

ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

హిమాయత్‌నగర్, మే 12: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు హిమాయత్‌నగర్ డివిజన్‌లో ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగనుండటంతో అధికారులు ఏర్పాట్లు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇచ్చిన అధికారులు అవసరమైన బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేసి 43 పోలింగ్ కేంద్రాలకు తరలించారు. డివిజన్‌లో మొత్తం 53,060 మంది ఓటర్లు ఉండగా పురుషులు 27,285 మహిళలు 25,784 మంది ఉన్నారు. నారాయణగూడ పీఎస్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలతోపాటు, చౌరస్తాలు, పలు ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. రూట్ మొబైల్ పార్టీలు మూడు, పోలీస్ పికెట్లు ఐదు, స్ట్రైకింగ్ ఫోర్స్ రెండు, ఏఎస్సైలు 12, ఎస్సైలు 8, సీఐలు 3, 150మంది పోలీస్ సిబ్బందితో ఎన్నికల భద్రత కట్టుదిట్టం చేశామని సీఐ చంద్రశేఖర్ తెలిపారు. రోజువారి పెట్రోలింగ్ టీంలతో భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఓటర్లు స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పించామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అర్హులంతా ఓటు హక్కును వినియోగించుకోవాలి

సికింద్రాబాద్, మే 12: లోక్‌సభ ఎన్నికల్లో అర్హులంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని బీఆర్‌ఎస్ సీతాఫల్‌మండి సీనియర్ నాయకుడు గరికపాటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ భవిష్యత్ ఓటు మీదే ఆధారపడి ఉందన్నారు. ప్రతిపౌరుడు రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని, మొదటిసారి ఓటుహక్కు పొందిన యువత కచ్చితంగా ఓటును వినియోగించుకుని, స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆయన కోరారు.

# లోక్‌సభ ఎన్నికల సమరం నేడే

పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసిన అధికారులు ● మొత్తం 543 పోలింగ్ కేంద్రాలు, 49 రూట్లు ● పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌లతో సిబ్బంది



సామగ్రితో పోలింగ్ కేంద్రానికి తరలివెళ్తున్న అధికారి



వెటర్నరీ వర్సిటీలో బ్యాలెట్ బాక్స్‌లను పంపిణీ చేస్తున్న అధికారులు



బ్యాలెట్ బాక్స్‌లతో బస్సు ఎక్కుతున్న అధికారులు, సిబ్బంది

బండ్లగూడ, మే 12: చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో సోమవారం జరుగనున్న ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మొత్తం 543 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఆదివారం రాజేంద్రనగర్ వెటర్నరీ విశ్వవిద్యాలయం నుంచి అన్ని పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌లను మొత్తం 49 రూట్లలో అధికారులు ప్రిసైడింగ్స్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ సిబ్బందికి పంపిణీ చేశారు. ఒక్కో బూత్ వద్ద ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, సెక్టోరియల్ అధికారి, మైక్రో అబ్జర్వర్లతో పాటు ముగ్గురు అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. తమకు కేటాయించి బస్సుల్లో ఆయా పోలింగ్ కేంద్రాలకు వెటర్నరీ వర్సిటీ నుంచి పైలట్ వాహనంతో బయలుదేరి వెళ్లారు.

**పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు..**

నేడు జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేసి పహారా కాస్తున్నారు.

## లోక్‌సభ ఎన్నికలకు సర్వం సిద్ధం

● ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్
● డీఆర్సీ కేంద్రంలో సిబ్బందికి పలు సూచనలు చేసిన రొనాల్డ్ రాస్



డీఆర్సీ కేంద్రంలో ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

బంజారాహిల్స్,మే 12: లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం యంత్రాలు ఆదివారం సాయంత్రానికి చేరుకున్నాయి. డీఆర్సీ సెంటర్ల నుంచి పటిష్టమైన పోలీస్ బందోబస్తు, నిఘా నడుమ పోలింగ్ సిబ్బంది ఈవీఎంలను తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6గంటల దాకా పోలింగ్ కొనసాగనుంది. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పోలింగ్ విధుల్లో ఉండే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఓటు వేసేందుకు వచ్చేవారికి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మంచినీటి సదుపాయం, వీల్ చైర్స్ అందుబాటులో ఉంచాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**జూబ్లీహిల్స్ పరిధిలో...**

జూబ్లీహిల్స్: యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రితో పోలింగ్ స్టేషన్లకు బయలుదేరారు. ఆదివారం డీఆర్సీ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ సందర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,87,056 మంది ఓటర్లున్నారు. సెగ్మెంట్‌లో 134 లొకేషన్లలో 329 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. 1600 ఓటర్లకు ఒక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్‌లో 66 లొకేషన్లలో 139 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను అధికారులు గుర్తించారు. ఆయా కేంద్రాల్లో ఒక మైక్రో అబ్జర్వర్‌తో పాటు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఏఆర్వో దశరథ్‌సింగ్ రాథోడ్ తెలిపారు. నేడు జరుగనున్న లోక్‌సభ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. సీనియర్ సిటిజన్స్‌ను, దివ్యాంగులను పోలింగ్ స్టేషన్లకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలు, వీల్ చైర్లు, సహాయకులను ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద టెంట్లు, కుర్చీలు, మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్వో హేమంత్ కేశవ్ పాటిల్, ఏఆర్వోలు ఆర్టీఓ దశరథ్‌సింగ్ రాథోడ్, నయీముద్దీన్, సేవా ఇస్లావత్ ఏర్పాట్లను సమీక్షించారు.



డీఆర్సీ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రితో పోలింగ్ స్టేషన్లకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

## శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో..

శంషాబాద్ రూరల్, మే 12: నేడు జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బ్రిలియంట్ పాఠశాల, కృష్ణవేణి పాఠశాలలో ఏర్పాటు చేశారు. దీంతో పాటు 13,14 వార్డులకు గాను రాళ్లగూడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. తొండుపల్లి, గొల్లపల్లి, ఊటుపల్లి, కోత్వాల్‌గూడ, సాతంరాయి ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని 27 గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టెంట్లు వేయడంతో పాటు క్యూలైన్లు ఏర్పాటు చేశారు.



శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద పూర్తయిన ఏర్పాట్లు

## తల్లిలేనిది జన్మలేదు: మున్సిపల్ చైర్‌పర్సన్



పెద్దతూప్ర ఆశ్రమంలో వృద్ధులకు మిఠాయి తినిపిస్తున్న చైర్మన్ సుష్మ, తదితరులు

శంషాబాద్ రూరల్,మే 12: తల్లిలేనిది మనకు జన్మలేదని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. ఆదివారం శంషాబాద్ మండలంలోని పెద్దతూప్ర గ్రామంలోని మేరియా సాదన్ వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ మాతృదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. సృష్టిలో తల్లిని మించిన దైవం లేదని వివరించారు. మాతృదినోత్సవ వేడుకలు వృద్ధాశ్రమంలో జరుపడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిరి స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రమాదేవి, ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోండి




ఖైరతాబాద్ చౌరస్తాలో ప్లకార్డులు పట్టుకొని అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఖైరతాబాద్, మే 12: మీ పిల్లల భవిష్యత్తు కోసం ఓటు వేయండి.. ఓటు హక్కు మన బాధ్యత అంటూ యూత్ ఫర్ యాంటి కరప్షన్ ఆధ్వర్యంలో యువత ఖైరతాబాద్ చౌరస్తాలో ప్లకార్డులతో ఆదివారం సాయంత్రం ప్రదర్శన నిర్వహించారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు పల్నాటి రాజేంద్ర మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాలతో పోల్చుకుంటే విద్యాధికులు ఉన్న నగరాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుందన్నారు. పోలింగ్ అంటే పిక్నిక్ రోజుగా భావిస్తున్నారని, చదువుకొని ఓటు వేయకపోవడం అత్యంత బాధాకరమన్నారు. నేడు జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటి కరప్షన్ కార్యదర్శులు కొన్నె దేవేందర్, కోమటి రమేశ్‌బాబు, మరియా, ఆంథోని, నరేశ్, శ్రీలేఖ, అద్వైత తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత చదువులతో ఆలోచనలకు పదును పెట్టాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పరమేశ్వర్, లక్ష్మి

హిమాయత్‌నగర్, మే 12: విద్యార్థులు ఉన్నత చదువులతో తమ ఆలోచనలకు పదును పెట్టి జీవితంలో స్థిరపడి సమాజానికి మంచి సేవలు అందించాలని ఆర్క్ డిగ్రీ, పీజీ కాలేజీ విద్యాసంస్థల చైర్మన్ ఎ.పరమేశ్వర్, వైస్ చైర్మన్ ఎ.లక్ష్మి సూచించారు. కాలేజీ వార్షికోత్సవం ఆదివారం నారాయణగూడలోని శాలీమార్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

## గర్భిణులకు పోషకాహార ప్యాకెట్లు పంపిణీ



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్యాకెట్లను పంచుతున్న రాయల సేవా సమితి సభ్యులు

అమీర్‌పేట్, మే 12: ప్రపంచ మాతృదినోత్సవం సందర్భంగా ఎస్ఆర్ నగర్ రాయల సేవా సమితి ఆధ్వర్యంలో అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్యాకెట్లు, మజ్జిగను పంపిణీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం సమితి అధ్యక్షులు ఆర్‌సీ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాతృదినోత్సవంతో పాటు ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని కూడా జరుపుకుంటూ ఆసుపత్రిలో నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు గర్భిణులు, బాలింతలు మెరుగైన ఆరోగ్యానికి తీసుకోవాల్సిన పౌష్టికాహార వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీనియర్ వైద్యురాలు డాక్టర్ చంద్రకళ, సమితి కార్యదర్శి విజయశ్రీ, నాగరేఖ, ఛాయాదేవి, ప్రభు, టీవీఎన్ రెడ్డి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు కోసం సొంతూళ్లకు..

● ప్రయాణికులతో కిక్కిరిసిన ఆరాంఘర్ చౌరస్తా ● బస్సుల కోసం నగరవాసుల పడిగాపులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 12: ఎన్నికల నేపథ్యంలో నగరవాసులు తమ సొంతూళ్ల బాటపట్టారు. తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఊర్లకు వెళ్లేందుకు బయలుదేరారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తా బస్టాప్ కిక్కిరిసిపోయింది. నగరంలో తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అనేక మంది ప్రయాణమయ్యారు. తమ ఓటు హక్కును తమ సొంతూళ్లల్లో వినియోగించుకునేందుకే నగరవాసులు మొగ్గు చూపారు. స్వగ్రామాలకు వెళ్లేందుకు వచ్చిన వారితో బస్టాండ్ కిటకిటలాడింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీ అదనపు బస్సులను నడుపుతున్నది. అయినా బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికులు రోడ్లపైనే పడిగాపులు కాస్తున్నారు. ఆరాంఘర్ చౌరస్తా నుంచి కర్నూల్, వికారాబాద్, షాద్‌నగర్, గద్వాల, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఉదయమే చేరుకోవడంతో రద్దీతో నిండిపోయింది.



ఆరాంఘర్ బస్టాప్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు



ఆరాంఘర్ చౌరస్తాలో బస్సులు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

**ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా ..**

తమ సొంతూళ్లకు వెళ్లేందుకు ఆరాంఘర్ చౌరస్తాకు వచ్చే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి హెల్‌లైన్ సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. అయినా ప్రయాణికుల తాకిడి ఎక్కువ ఉండడంతో ఆర్టీసీ బస్సుల సరిపోవడం లేదు. బస్సుల్లో కిక్కిరిసిపోయి ప్రయాణం సాగించారు.

**ప్రైవేటు ఆపరేటర్ల దోపిడీ..**

నగరం నుంచి తమ ఊళ్లకు వెళ్లేందుకు ప్రజలు అధిక సంఖ్యలో ఆరాంఘర్ చౌరస్తాకు చేరుకున్నారు. అంతేస్థాయిలో ఆర్టీసీ బస్సులు నడుపుతున్నా ప్రైవేటు దోపిడీని అరికట్టలేకపోతున్నారు. ప్రైవేటు వాహనాదారులు ప్రయాణికులను తమ ఊళ్లకు తీసుకువెళ్లేందుకు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. ప్రయాణికుల నుంచి సాధారణ చార్జీలకన్నా నాలుగు, ఐదు రెట్లు ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నారు. తమ సొంత ఊరికి వెళ్లేందుకు ఓటర్లు ఆసక్తి చూపుడుతుండడంతో ప్రైవేటు వాహనాదారులు వీటిని ఆసరాగా చేసుకొని తమ దోపిడీని యథేశ్చగా సాగిస్తున్నారు.

## సైకో ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

బన్సీలాల్‌పేట్, మే 12: పద్మారావునగర్‌కు చెందిన సైకో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 252వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా ఓటు వేయాలని కోరారు. అనంతరం రోడ్ల పక్కన ఉంటూ ఆకలితో అలమటించే వృద్ధులను, నిరాశ్రయులను, దివ్యాంగులను అప్యాయంగా పలకరించి వారికి భోజనం సమకూర్చామని సైకో ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. పాదచారులు, ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్లకు మజ్జిగ అందజేశామని పేర్కొన్నారు.ఎండలకు అల్లాడుతున్న అనాథలు, నిరాశ్రయులను చేరదీసి వారికి ఆశ్రయం, ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని వారన్నారు. కార్యక్రమంలో సైకో ఫౌండేషన్ సభ్యులు కోమల్, మానస, అఖిల్, శుభం తదితరులు పాల్గొన్నారు.




అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్‌కుమార్, పావని

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శనలు

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు నృత్యకారుల కూచిపూడి, భరతనాట్య నృత్యాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చెన్నై నుంచి విచ్చేసిన భరతనాట్య కళాకారి రక్షా దేవనాథన్, కూచిపూడి నృత్య గురువులు చూడామణిలు తమ శిష్య బృందాలతో కలిసి నర్తించిన పలు అంశాలను సందర్శకులను ఆద్యంతం అలరించాయి. – కొండాపూర్, మే 12



## రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత బహుజనులది

సికింద్రాబాద్, మే 12: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత బహుజనులందరిదని దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరుడు కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చాలనే ధోరణిలో ఉందన్నారు. అందుకే బీజేపీ హఠావో.. రిజర్వేషన్లు బచావో... అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రాజ్యాంగం ద్వారానే బహుజనులకు రిజర్వేషన్ ఫలాలు అందుతున్నాయన్నారు. ప్రజలు ఆగం.. ఆగం... కావొద్దని, అలోచించి ఓటు వేయాలన్నారు. దళిత సంఘర్షణ సమితి (డీఎస్ఎస్) భారతదేశంలో రాజ్యాంగాన్ని రక్షించాలన్నా, రాజ్యాంగ పరిరక్షణ కోసం దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర కమిటీ తరుపున బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. భారత రాజ్యాంగం యథావిధిగా ఉండాలంటే దేశంలో ఇతర పార్టీ అధికారంలోకి రావాలని ఆయన పేర్కొన్నారు.